**కథ**

# పొదరిల్లు

**మాలతి ముఖం కోపంతో ధుమధుమలాడిపోతోంది. అప్పుడే స్నానం కానిచ్చి అద్దం ముందు నుంచుని తల దువ్వుకుంటున్న భర్త వంక చూసింది. అద్దంలోంచి భార్య ముఖకవళికలని గమనించాడు రఘుపతి. భార్య ముఖంలో ఆ చిరాకుకి కారణం తన తల్లి వసుంధరమ్మ అని తెలుసు అతనికి. ఇది అత్తాకోడళ్ళ సమస్య.**

కాశ్మీరు సమస్యకన్నా పూర్వం నుంచి ఉన్న సమస్య. చిన్న చిన్న సర్దుబాట్లతో పరిష్కారమయ్యే సమస్యేకానీ ఆ సర్దుబాటు ఎపుడూ అవతలవైపు నుంచే రావాలనుకోవడం వల్ల అదెప్పుడూ పరిష్కారం కాని సమస్యలా మిగిలిపోతూనే ఉంటుంది.

''చూశారా మీ అమ్మగారి ధాష్టీకం. డెబ్భయ్యేళ్ళు మీదపడ్డాయి. పెట్టింది తిని కృష్ణారామా అనుకుంటూ ఓ మూల పడి ఉండచ్చుగా. ఉహూ..ఆవిడ చాదస్తంతో కోడలిని సాధించాలని చూస్తోంది'' చేతులు తిప్పుతూ అన్నది మాలతి.

విషయం ఏమిటని అడగలేదు రఘుపతి. అలా అడక్కపోయినా తను చెప్పక మానదని తెలుసు రఘుపతికి.

''పొద్దున్నే ఎంత హడావిడిగా పనిచేస్తానో మీకు తెలుసుగా. కాఫీలు, టిఫిన్లు, వంట... ఈ పనులన్నిటితోపాటు చంటివాడి పనులు కూడా చేసుకోవాలి కదా..ఇవన్నీ చేసుకొని తొమ్మిదిన్నరకల్లా ఆఫీసుకి పరిగెత్తాలి ఔనా కాదా..''

ఔనన్నట్టుగా తల ఊపాడు రఘుపతి.

''ఇన్ని పన్లూ నోరెత్తకుండా ఒక్కదాన్నే చేసుకుపోతూంటే మీ అమ్మగారి ఛాదస్తమొకటి- మడిగట్టుకు వంట చేయాలిట. అలా చేయటల్లేదని బొత్తిగా మడి, ఆచారం లేదని చంపుతున్నారు నన్ను. ఇంకా మడి కట్టుకుని వంటలు చేయడానికి నేనేమీ పాతకాలం మనిషిని కాదు. పోనీ మీ అమ్మగారి తృప్తికోసం అలా చేద్దామన్నా, అన్నీ అలా పద్ధతిగా చేస్తే ఆఫీసు టైం దాటిపోయి అక్కడ బాస్ చేత అక్షింతలు వేయించుకోవాలి''

మాలతి గొంతులో ఆవేదన అర్థమయింది రఘుపతికి. భార్య వాదన కరెక్టుగానే తోచింది. అందుకే తల్లికి నచ్చచెప్పి కన్విన్స్ చేయాలనుకున్నాడు.

''బయటకెళ్ళి వచ్చేవాళ్ళం. టైంకి ఆఫీసుకి వెళ్ళాలంటే తలస్నానాలు, మడివంటలూ కుదరవు. నీ ఛాదస్తం తగ్గించుకో. హాయిగా నీ కోడలు వండి పెట్టింది తిని కృష్ణారామా అనుకో... నీ కోడల్ని విసిగించకు-'' అన్నాడు రఘుపతి తల్లితో.

అంతే- బొట బొటా కన్నీళ్ళు కార్చింది వసుంధరమ్మ.

''ఎంత కష్టపడి పెంచానురా నిన్ను. నీకు ఊహ కూడా రాకుండానే నీ తండ్రి కాలం చేస్తే అక్కడా ఇక్కడా వంటలు చేసి నిన్ను పెంచుకున్నాను. చిన్నతనంలో నీకు జబ్బు చేస్తే సిటీకి తీసుకెళ్ళి వైద్యం చేయించాలని మనూరి ఆచారిగారు చెబితే డబ్బు లేక చేతినున్న బంగారుగాజులు తాకట్టుపెట్టి నిన్ను దక్కించుకున్నాను. నీ చదువుకోసం ఉన్న పెంకుటింటిని అమ్మేసాను. ఇప్పుడు పెద్దదాన్నయ్యాను. ఎవరికీ పనికిరాకుండా పోయాను. ఏదో పెద్దదాన్ని కాస్త ఛాదస్తమే ఉందనుకో- మనమే సర్దుకుపోదాం లేవే అని భార్యకి చెప్పడం చేతకాక కన్నతల్లిని నన్నే ఓ మూల పడుండమంటావా'' వసుంధరమ్మ వాగ్ప్రవాహం గట్టు తెగిన నదిలా పొంగిపోతోంది.

తల్లి కన్నీటికి కరిగిపోయాడు రఘుపతి. ఇవాళ తను ఈ స్థాయికి వచ్చాడంటే కారణం తన తల్లి చేసిన త్యాగాలే కదా. ఆమె రెక్కల కష్టంతో తన జీవిత సోపానాన్ని నిర్మించుకున్నాడు తను. అలాంటి తల్లిని కష్టపెడితే తనకి పుట్టగతులుండవ్. ఏదో ఆవిడ ఉన్నంతకాలం ఆవిడకి అనుగుణంగా నడుచుకుంటే సరి. ఆ మాటే భార్యకి చెప్పాలనుకున్నాడు.

''మాలతీ ఈ జీవితం అమ్మ పెట్టిన భిక్ష. తల్లిని బాధపెడితే పుట్టగతులుండవ్. కాబట్టి..''

రఘుపతి మాట పూర్తి కాకుండానే విసవిసా బాత్రూంలోకెళ్ళి దఢేలున తలుపేసుకుంది మాలతి. తలస్నానం చేసింది కాబోలు జుట్టుకి పిడప చుట్టుకుని వంటింట్లో దణ్ణానికున్న మడి చీర తీసి చుట్టుకుంది. దీపారాధన చేసింది. అస్పష్టంగా తనలో తనే అనుకుంటోంది. దేవుడి అష్టోత్రం చదువుతోందో అత్తగార్ని తిడుతోందో అర్థం కాలేదు రఘుపతికి. ఇంకొక కప్పుకాఫీ తాగాలనిపించినా భార్యని అడిగే ధైర్యం చేయలేక ఊరుకున్నాడు. దాదాపు తొమ్మిది అవుతుండగా భోజనం వడ్డించింది మాలతి.

★ ★ ★

రాత్రి పదింటికి వంటింటి పని ముగించి బెడ్రూంలోకి అడుగుపెట్టింది మాలతి. భార్య రాక కోసమే ఎదురు చూస్తున్న రఘుపతి- ''ఇవాళ నామీద బాగా కోపం వచ్చింది కదూ'' అన్నాడు భార్యతో.

''నేనెలా ఏడిస్తే మీకేం! మీరూ మీ అమ్మా తృప్తిగా ఉన్నారుగా'' విసురుగా అన్నది మాలతి.

''సారీ.. నిన్ను కష్టపెట్టాలని నా ఉద్దేశ్యం కాదు'' భార్యమీద చెయ్యివేస్తూ అన్నాడు.

''అమ్మకొంగు పట్టుకు తిరిగే మనిషికి పెళ్ళెందుకు? పెళ్ళామెందుకు?'' భర్త చేతిని తోసేస్తూ అన్నది మాలతి.

భార్య వంక నిస్సహాయంగా చూశాడు.

''మీకసలు భార్య ఇష్టాఇష్టాలను గౌరవించాలన్న జ్ఞానం లేదు. మీతో సమానంగా చదువుకున్నాను. మీరు సంపాదించినంతా నేనూ సంపాదిస్తున్నాను. మన భవిష్యత్తు అవసరాలకి మీరెంత ఖర్చు చేస్తారో నేనూ అంతా చేయగలను. ఐ యామ్ ఏన్ ఇంటలెక్చువల్ మోస్ట్ ఎఫిషియంట్ అని అందరి చేతా అనిపించుకున్న నేను ఈరోజు ఆఫీసుకు లేట్‌గా వెళ్ళి మా బాస్‌చేత బాడ్ రిమార్క్ వేయించుకున్నాను. మీ అమ్మగారి ఛాదస్తానికి తలవంచి మడివంట చేసి, పని త్వరగా తెముల్చుకోలేక ఆలస్యంగా ఆఫీసుకెళ్ళి అందరి ముందూ మాట పడ్డాను. నా ఆత్మగౌరవం దెబ్బతిన్నది'' మాలతి కళ్ళు వర్షిస్తున్నాయి.

రఘుపతి మాట్లాడలేకపోయాడు. ఎటూ చెప్పలేడు తను. తనకి తల్లి ప్రేమా కావాలి. భార్య అనురాగం కావాలి. ఒకరికోసం ఒకరిని వదులుకోలేడు తను. కానీ ఎలా? అలా ఆలోచిస్తూనే పడుకున్నాడు.

★ ★ ★

''ఏమండీ.. త్వరగా లేవండి'' కంగారుగా తట్టి లేపుతోంది మాలతి. ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు రఘుపతి.

''చంటాడికి జ్వరంగా ఉందండి. ఒళ్ళు కాలిపోతోంది'' ఆదుర్దాగా అన్న భార్య మాటలకి గబగబగా బ్రష్ చేసుకుని కొడుకుని తీసుకొని సందు చివరనున్న డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళాడు రఘుపతి.

భర్తకోసం ఎదురుచూస్తూ అన్యమనస్కంగానే పనిచేస్తోంది మాలతి.

డాక్టరు రాసి ఇచ్చిన మందులు కొని పిల్లవాడిని భుజాన వేసుకొని వచ్చాడు రఘుపతి.



''ఏమన్నాడండి డాక్టరు'' గుమ్మంలోనే అడిగింది మాలతి.

''మామూలు జ్వరమే. కంగారుపడాల్సిన పనిలేదన్నాడు. టైం ప్రకారం ఈ టాబ్‌లెట్స్ వేయమన్నాడు.''

''ఈరోజు నాకు శెలవు కుదరదండీ. ఆఫీసులో ఆడిటింగ్ జరుగుతోంది. బాబుని మీరు చూసుకోండి'' అన్నది మాలతి.

''నాకా..నాకస్సలు కుదరదు. మా సెక్షనలో ఇద్దరు సెలవు పెట్టారు. పనంతా నేనే చూసుకోవాలి'' దిగులుగా అన్నాడు రఘుపతి.

''మరైతే ఎలాగండీ..'' డీలాపడినట్టు అన్నది మాలతి.

మనవడి దగ్గరే మంచం మీద కూర్చున్న వసుంధరమ్మ ''మీకెందుకర్రా బెంగ, మీ ఇద్దర్లో ఎవరూ శెలవుపెట్టఖ్ఖర్లేదు. మీకన్నా వాడిని నేను బాగానే చూసుకుంటాను. ఆ మందులు ఎప్పుడు వేయాలో చెపితే నేను వేస్తాలే. నా మనవడు నాకు బరువా ఏమిటి'' అభయం ఇస్తున్నట్టుగా అన్నది. రఘుపతికి, మాలతికి ఒక్కసారిగా ప్రాణం లేచివచ్చినట్లైంది. హాయిగా ఊపిరి పీల్చుకొని కొడుకుని వసుంధరమ్మ కప్పగించి నిశ్చింతగా ఆఫీసుకి వెళ్ళిపోయారు. అన్నమాట ప్రకారమే వసుంధరమ్మ మనవడిని కంటికిరెప్పలా చూసుకుంది. వసుంధరమ్మ సేవల ఫలితమో డాక్టరిచ్చిన మందుల ప్రభావమో ఆ సాయంత్రానికే చంటివాడికి జ్వరం తగ్గిపోయింది. ఆ రోజంతా ఆఫీసు పనితో సతమతమవుతున్నా మధ్యలో చంటివాడు ఎలా ఉన్నాడో అన్న బాధ మాలతి మనసుని కలచి వేస్తూనే ఉంది. సాయంత్రం ఆఫీసు నుండి వస్తూనే బాబు కోసం వెదికిన ఆమె కళ్ళు ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి ఆనందభాష్పాలు రాల్చాయి.

ఆదుర్తి బాల

అక్కడ ముందు గదిలో సోఫాలో కూర్చుని మనవడిని ఒళ్ళో కూర్చోపెట్టుకొని కబుర్లు చెప్తూ పాలలో బ్రెడ్డు వేసి తినిపిస్తోంది వసుంధరమ్మ. తను ఎంత బతిమాలినా, కోప్పడినా తినడానికి మారాం చేసే కొడుకు బామ్మ చెప్పే కబుర్లు, పిట్ట కథలనీ ఆసక్తిగా వింటూ బుద్ధిగా బ్రెడ్డు తిన్నాడు. అప్పటివరకూ అత్తగారిమీద ఉన్న కోపం పోయి ఆవిడ పట్ల కృతజ్ఞతతో నిండిపోయింది మాలతి మనసు.

భార్యాభర్తలిద్దరు ఉద్యోగాలకెళితే చంటిపిల్లలని చూసే పెద్దదిక్కులేక తప్పనిసరై ఏ చైల్డ్ కేర్ సెంటర్లోనో వదిలిపెట్టి వెడుతున్నారు తల్లిదండ్రులు. కాస్త పెద్దయి స్కూళ్ళకెళ్ళే పిల్లలైతే సాయంత్రం తల్లి, తండ్రీ వచ్చేవరకూ బిక్కు బిక్కుమంటూ కాలక్షేపం చేస్తున్నారు. అలా ఒంటరిగా ఉండే పిల్లలలో అభద్రతా భావం చోటు చేసుకుని వారి భావి జీవితం మీద ఎంతో దుష్ప్రభావం చూపిస్తుందట.

ఆ విషయంలో తను అదృష్టవంతురాలే. కన్న తల్లి కన్నా ఎక్కువగా మనవడిని చూసుకునే అత్తగారుంది తనకి అనుకుంది మాలతి.

మర్నాడు ఐదింటికి లేవడానికి గడియారానికి అలారం సెట్ చేసుకుంది మాలతి.

''ఏమిటి రేపు స్పెషల్ అంత త్వరగా లేవాలనుకుంటున్నావు?'' భార్య నుద్దేశించి అన్నాడు రఘుపతి.

''ఏమీ లేదండీ అత్తయ్యగారి రూట్‌లో పని చెయ్యాలంటే కాస్త ముందే లేవాలి మరి'' అంటున్న భార్యవంక ఆశ్చర్యంగా చూశాడు రఘుపతి. అతని ఆశ్చర్యాన్ని గ్రహించినట్టుగా అన్నది మాలతి.

''హాయిగా విశ్రాంతి తీసుకోవాల్సిన ఈ వయసులో మనవడి బాధ్యత తీసుకోవడం మీ అమ్మగారికి కష్టమే. అయితేనేం, ఆవిడ ఆ కష్టాన్ని సంతోషంగా స్వీకరిస్తున్నారు. పొద్దున్న మనం ఇల్లు విడిచి పెట్టిన దగ్గర్నుండి సాయంత్రం ఇంటికి వచ్చేవరకూ వాడి అల్లరిని భరిస్తూ, వాడి వెనకాలే పరుగు పెడుతూ ఆప్యాయంగా చూసుకుంటున్నారు. మనకోసం స్వసుఖాన్ని త్యాగం చేసిన ఆవిడకోసం నేను కాస్త కష్టపడితే తప్పులేదనే అనుకుంటున్నాను.''

ఆ మర్నాటి నుంచి ఓ గంట ముందు లేచి అత్తగారు పద్ధతిలోనే మడివంట చేసి టైంకి తెముల్చుకోవడం మొదలుపెట్టింది మాలతి.

★ ★ ★

ఎవరో తలుపుకొట్టిన చప్పుడైతే వెళ్ళి తలుపుతీసింది వసుంధరమ్మ. ఎదురుగా తన పిన్ని కూతురు కాత్యాయని. తలుపు తీస్తూనే ఆనందంగా ఆశ్చర్యంగా లోపలికి ఆహ్వానించింది వసుంధర.

కాత్యాయని తనకన్నా ఆరు, ఏడు ఏళ్ళు చిన్నదైనా తనే చిన్నదానిలా అనిపించింది వసుంధరమ్మకి. పైకి నవ్వుతూనే మాట్లాడుతున్నా ఆ నవ్వు వెనక గూడుకట్టుకున్న విషాదమేదో ఉందనిపించింది వసుంధరమ్మకి.

రెండు రోజులు గడిచాక అడిగింది కాత్యాయని రఘుపతిని, ఆ ఊళ్ళో ఏవైనా ఓల్డుఏజ్‌హోమ్స్ ఉన్నాయేమో కనుక్కోమని.

''ఎవరి కోసం చిన్నమ్మా-'' ఆశ్చర్యంగా అన్నాడు రఘుపతి.

''ఇంకెవరికోసం రా నాకోసమే'' బాధతో కళ్ళనీళ్ళు వస్తుంటే బలవంతంగా నవ్వుతూ అన్నది.

''నీకా..నీకంత ఖర్మేంటి చెట్టంత కొడుకూ బోల్డంత ఆస్తీ...'' అంటున్న వసుంధరమ్మ మాటలు పూర్తికాకుండా ''ఆ తరగని ఆస్తీ, మంచి భర్తా నా అదృష్టం అనుకున్నాను. తొలి చూలులోనే మగబిడ్డని కన్నానని గర్వపడ్డాను. కొడుకుని చూసుకుని మురిసిపోయాను. ఒక్కడే కొడుకని గారం చేశాను. అదే నే చేసిన పొరపాటేమో.

వాడిమీదున్న వల్లమాలిన అభిమానంతో వాడెక్కడ తిరిగినా పట్టించుకునే దాన్ని కాదు. ఓరోజు ఎవరో అమ్మాయిని తీసుకొచ్చాడు. తన క్లాస్‌మేట్ అన్నాడు. కొన్నాళ్ళకి ఆ అమ్మాయినే చేసుకుంటానన్నాడు. ఆ అమ్మాయి మతం వేరు, వద్దురా అన్నారు ఆయన. వినలేదు వాడు. ఏకంగా రిజిష్టర్ మారేజ్ చేసుకొని వచ్చాడు. మన దేవుళ్ళంటే గిట్టదు ఆ అమ్మాయికి. బొట్టు, పూలు పనికిరావు. మటన్ కూర లేకపోతే అన్నం తినదట. రోజూ మాంసాహారం వండేది. అది భరించలేక నేనూ ఆయనా వేరే గదిలో వండుకు తింటూ ఉండేవాళ్ళం. నా కొడుక్కి ఏం చెప్పి పెట్టిందో ఏమో ఓ రోజు వాడు వచ్చి తన వంతు ఆస్తి తనకిచ్చేయమన్నాడు. ఆ పరిణామాలు తట్టుకోలేక దిగులుతో ఆయన మంచం పట్టారు. మంచం మీదున్న తండ్రిని చూసి కూడా జాలి కలుగలేదు నా కొడుక్కి. తనవంతు వాటా రాసియ్యక పోతే కోర్టుకెడతానని బెదిరించేవాడు. వాడు చెప్పినట్టే వాడికి రావల్సిన ఆస్తి రాసి కన్ను మూశారు ఆయన. ఒక్కదాన్నీ..నాకు ఆయన మిగిల్చిన ఆస్తి చేతిలో ఉన్నదాన్ని. ఎదురుగా మృగంలాంటి కొడుకు. నా జీవితానికి వాడి దగ్గర భద్రత లేదని తెలుసుకున్నాను. ఏదైనా వృద్ధాశ్రమానికి డబ్బు కట్టి చేరిపోదామని వచ్చాను'' అంటున్న కాత్యాయని దీనగాథకి అందరి హృదయాలూ బరువెక్కాయి.

''అయినా నాకేం బాధలేదు. స్వంత అక్కవి కాకపోయినా అంతకన్నా ఎక్కువే నువ్వు నాకు. అదృష్టమంటే నీదేనే వసుంధరా. బంగారంలాంటి కోడలు. ఇంత చదూకున్నా మన సంప్రదాయాలకీ, ఆచారాలకీ విలువనిస్తూ నీ పద్ధతులకి అనుగుణంగా నడుచుకునే కోడలుండడం నిజంగా నీ అదృష్టం. వృద్ధాశ్రమంలో చేరుతున్నానన్న బాధ లేదు నాకు. ఎప్పుడైనా మీ ఇంటికొచ్చి రెండు రోజులు గడిపి వెడుతుంటాను'' అన్నది కాత్యాయని.

''ఎక్కడో ఉండడమేమిటి. మీరూ మాతోనే ఉండండి. మీరేం పైవారు కాదు మాకు. పైగా మా అత్తగారికి తోడుగా కూడా ఉంటారు'' అన్నది మాలతి.

కోడలి విశాల హృదయానికి వసుంధరమ్మ మనసు తృప్తితో నిండిపోయింది.

''నాకు ఆ మాటే చాలమ్మా కొండంత తృప్తి. ఆశ ఉండచ్చు కానీ మనిషికి అత్యాశ ఉండకూడదు. ఎప్పుడూ మీతోటే ఉండాలని కోరుకోవడం అత్యాశే అవుతుంది. ఎప్పుడైనా ఓసారి మీ అందరి మధ్యలో గడపాలని ఆశతో వస్తే కాదనకండి'' అన్నది కాత్యాయని.

ఇక ఆవిడ నిర్ణయం మారదని తెలిశాక రఘుపతి ఆవిడని తీసుకెళ్ళి ఓల్డు ఏజ్ హోంలో చేర్పించి వచ్చాడు.


అత్తగారు చెప్పకుండానే మాలతి బజారుకెళ్ళి కాత్యాయనికి చీర కొనుక్కొచ్చి ఇచ్చింది. మొహమాట పడుతూనే తీసుకుంది కాత్యాయని.

ఆ రోజే ఓ నిర్ణయం తీసుకుంది వసుంధరమ్మ. కోడలు ఈ కాలం పిల్ల. ఇంటా, బైటా కష్టపడుతోంది.

తన ఛాదస్తంతో ఇంకా కోడలిని కష్టపెట్టడం భావ్యం కాదు తనకి. తన కాలంలో తనకి నచ్చిన పద్ధతిలో బతికింది.

ఈ కాలం పిల్లలు వాళ్ళ పద్ధతిలో బతకడానికి తనెందుకు అడ్డుపడుతోంది.

మంచి హృదయం ఉన్న మనిషి మాలతి. మడీ దడీ కన్నా మంచితనం ముఖ్యం కాదూ- అందుకే - ఆ మర్నాడు హడావిడిగా లేచి స్నానానికి వెళ్ళబోతున్న కోడలితో ''అమ్మాయ్ నువ్వెలా వండిపెట్టినా అభ్యంతరం లేదు. మడీ దడీ అంటూ కూర్చోక వంటచేసి కాసేపు రెస్టు తీసుకో'' అంటున్న అత్తగారి వంక ఆశ్చర్యంగా చూసింది మాలతి.




కుటుంబ వ్యవస్థ భారతీయ సంప్రదాయ విశిష్టత. కుటుంబంలో మనుషులందరూ సంతోషంగా ఉండాలంటే ఒకరినొకరు అర్థం చేసుకోవడం ఎంతో ముఖ్యం. అప్పుడే ఆ యిల్లు పూలపొదరిల్లు అవుతుంది.

తన ఇల్లు పూలపొదరిల్లు అవబోతోందని గ్రహించి తృప్తిగా నవ్వుకున్నాడు రఘుపతి.